
# జ్ఞానోదయం

వాసిరెడ్డి సీతాదేవి



## షణ్ముఖం ఉలిక్కిపడి నిద్రలేచాడు.

**ఆదిలక్ష్మి పాలవాడితో ఘర్షణపడుతూ వుంది. విసుగ్గా మంచం దిగాడు షణ్ముఖం. అప్పటికే బారెడు పొద్దెక్కింది. గబగబా బాత్‌రూంలోకి నడిచాడు.**

ఇవ్వాళ ముప్పై ఒకటో తారీఖు సాయంత్రంలోగా పని పూర్తిచేసి ఆఫీసర్ కు చూపించకపోతే తను వినాల్సిన మాటలు ఆ భగవంతుడికే తెలుసు! ఆఫీసర్ మరీ ఏమైనా అంటాడు; తను ఆఫ్టరాల్ ఒక ఎన్. జీ. ఓ. ఏమన్నా తల వంచుకొని పడాలి తలెత్తి వినకూడదు.

త్వరత్వరగా స్నానం ముగించాడు. నాలుగు పచ్చడి ముద్దలు మింగి ఆఫీసుకు బయలుదేరాడు.

"ఏమండీ!"

గడప దాటుతున్న షణ్ముఖం ఆగాడు. విసుగ్గా భార్య ముఖంలోకి చూశాడు.

"ఇవ్వాళన్నా పెందలాడే వస్తారా!"

షణ్ముఖానికి ఒళ్ళు మండిపోయింది.




"మాటాడరేం?" దీనంగా అన్నది ఆదిలక్ష్మి. షణ్ముఖం మాట్లాడలేదు.

"నిన్న కూడా పాపకు మందు లేదు. పిల్లవాడికి కొంత తగ్గు ఎక్కువైంది."

షణ్ముఖం భార్య ముఖంలోకి చూశాడు.

ఆమె చూపులు అతని గుండెకు తుమ్మ ముళ్ళలా గుచ్చుకున్నాయ్. అపరాధిని చూసినట్టు చూస్తుంది భర్తను భార్య.

"మాటాడరేం?"

తను ఏం మాట్లాడాలి? తను రావాలని రోజు ఆలస్యంగా వస్తున్నాడా? ఆఫీసులో తనకేదో ఆకర్షణ వుండి కూర్చుంటున్నాడా? తనేమన్నా ఆఫీసరా కావాలన్నప్పుడు సీటులోంచి లేచి వచ్చి, గవర్నమెంటు కారులో దర్జాగా కూర్చుని బయలుదేరటానికి? దీనికి బొత్తిగా బుద్ధి లేదు. తన గురించి బొత్తిగా ఆలోచించదు.

"మాటాడరేం? ఒక వైపు చిన్న వాళ్ళిద్దరికి జబ్బులు. మీ అమ్మగారికి తన పూజలతోనే సరిపోతుంది. ఇంటెడు చాకిరీతో సతమతమై పోతున్నాను. మీరేమో రాత్రి తొమ్మిదింటి దాకా రారాయె! పెళ్ళాం బిడ్డలు గుర్తున్నట్టే వుండదా మీకు?"

"అయిందా?" కోపంగా అన్నాడు.

ఆదిలక్ష్మి కళ్ళలో నీరు తిరిగింది.

"మీకు బొత్తిగా మా గురించి ఆలోచనే వుండదు." ఆదిలక్ష్మికి దుఃఖం పొంగుకొచ్చింది. ఆమెకిక మాటాడలేక పోయింది. "ఛీ! ఛీ! ఇదొకటి! నీళ్ళ కుండ ఎప్పుడూ నెత్తినే వుంటుంది. నా బిడ్డలూ నేనూ, నీకు అంత బరువై పోయామా ఏమిటి?" అన్నది భార్య.

దీని బిడ్డలట! తన బిడ్డలు కారూ! తన పెళ్ళాం అన్నా, తన పిల్లలన్నా తనకు పట్టటం లేదా! వాళ్ళు తనకు బరువు అనుకుంటున్నాడా? అలా అనుకుంటే ఏనాడో ఈ బాధ్యతల నుండి పారిపోయేవాడు! దీనికి ఆ మాత్రం జ్ఞానం లేదు.

ఆదిలక్ష్మి కళ్ళు తుడుచుకుంది.

ముందు ఏడుపు పుట్టి ఆ తర్వాత ఇది వుంటుంది. దీని బతుకంతా ఏడుపే. ఈ ఇంటి కప్పు, గోడలూ దీని కన్నీళ్ళతో నానినాని ఎప్పుడో కూలిపోతాయి.

విశ్వనాథం రెండడుగులు ముందుకు వేశాడు.

"నా గోడు ఆలకించే వాళ్ళేలేరు." వెక్కిళ్ళ మధ్యనుంచి ఆదిలక్ష్మి కంఠం.

ఓ భగవంతుడా! ఎక్కడున్నావయ్యా! ఒక ఏనుగు ఏడిస్తేనే "సిరికిం చెప్పడు— శంఖు చక్ర యుగమున్ – చేదోయి సంధింపడు ..." ఇంకా ఏమేమో వదిలేసి పరిగెత్తుకొచ్చావటగా! నువ్వు ఆపద్బాంధవుడివట! కరుణామయుడివట! ఒక మనిషి అందులో ఆడమనిషి ఏడుపు. ఏనుగు ఏడుపు కదిలించినంతమాత్రం నిన్ను కదిలించలేకపోతుందా? మరెందుకు రావు? నీగురించి చెప్పిందంతా అబద్ధమేనా?

"ఏమండీ!"

"ఛ! ఊరుకో! ఎప్పుడూ ఏడుపే! వెధవ ఏడుపు ముఖము నువ్వూను! ఆఫీసు పని అయిపోగానే వస్తానే" రెండడుగులు ముందుకు వేశాడు షణ్ముఖం.

"వచ్చేప్పుడు డాక్టరు దగ్గిరకెళ్ళి మందు కూడా తీసుకురండి."

"అలాగే," ఎలాగో అనగలిగాడు.

"ఆ మర్చిపోయాను కాఫీపొడీ, పంచదార కూడా అయిపోయినై,"

"ఊ!" మరో అడుగుముందుకు వేశాడు.

"పిల్లకు బొత్తిగా ధారకం పోవటం లేదు. ఒక గ్లూకోజ్ డబ్బా, బత్తాయి పళ్ళూ...."

షణ్ముఖం గిర్రున తిరిగి భార్య ముఖంలోకి చూశాడు. "ఊఁ ఇంకా?"


ఆదిలక్ష్మి భర్త ముఖంలోకి చూస్తూ మాటాడలేకపోయింది. ఆరోజు మొప్పై ఒకటో తారీఖని గుర్తొచ్చి బొమ్మలా శిలబడిపోయింది.

"ఒరే అబ్బాయ్! కందిపప్పూ, పెద్దుల్లి పాయలూ, చింతపండూ తీసుకురారా."

షణ్ముఖం తల్లి మంగమ్మ ఉతికి, పిండిన బట్టలు భుజంమీద వేసుకొని బయటికి వచ్చింది.

షణ్ముఖానికి వెనక్కి తిరిగి తల్లి ముఖంలోకి చూసే ధైర్యంలేక వీధిలోకి చూస్తూ నిలబడిపోయాడు.

"ఎటూ మార్కెట్‌కు వెళ్తారుగా కూరగాయాలు కూడా పట్టుకు రండి!" పెళ్ళాం గొంతు.



"ఓరే నాయనా. ఓపాతిక నిమ్మకాయలు కూడా పట్టుకురా!కోసి ఉప్పులో వేస్తాను నోరు మరీ చవి చచ్చిపోయింది."

"నాన్నోయ్. రంగు పెన్సిళ్లూ జామెంట్రీ బాక్సు.... మాష్టరు గారు తిడుతున్నారు"

"ఏమండోయ్ మరి ..."

"నాన్నోయ్ మరేమో...."

"ఓరే నాయనా..."

షణ్ముఖం చర చర వెళ్ళి పోయాడు.

రోడ్డు మీద ఉసిగా నడుస్తున్నాడు. చుర చుర ఎండ నెత్తి మాడుస్తు వుంది. అరిగి పోయిన చెప్పులు ఎండకు కరిగిన తారుకు మధ్య మధ్య అతుక్కుంటూ వున్నాయి. మైలు దూరం నడవాలి నటరాజ సర్వీస్.

నిగనిగలాడుతున్న నల్లటి ఎంబాసిడర్ షణ్ముఖం పక్కగా దూసుకుపోయింది. అది ఎవరి కారో తెలుసు.

ఆఫీసరు వెళ్ళాడు. తనకు ఇవ్వాళ ఆలస్యం కాక తప్పదు- నడక వేగం హెచ్చించాడు.

ఏమిటీ జీవితానికి అర్థం? ఈ బ్రతుక్కి ప్రయోజనం? అసలు తను బ్రతికేది కూడా ఒక బ్రతుకేనా?

సెంటర్‌లో కొచ్చేసరికి క్లాక్ టవర్ "టంగ్"న ఒక దెబ్బ కొట్టింది. శ్రీరామ చంద్రమూర్తి విరిచిన శివధనుస్సు శబ్దంలా వినిపించింది షణ్ముఖానికి.

షణ్ముఖం చివ్వున తలెత్తి చూశాడు. సత్యాన్వేషణలో పడి విహరిస్తున్న మనసు తారురోడ్డు మీద సెంటర్‌లో నిలబడిపోయిన అతనిలోకి తిరిగి వచ్చింది.

పదిన్నర!

అమ్మయ్యో! పదిన్నరే!

అప్పుడే పదిన్నర అయింది. ఇంకా అరమైలు నడవాలి. సరిగ్గా బయలుదేరే ప్పుడే అందరికీ అన్నీ గుర్తొస్తాయి. వాళ్ళకు బొత్తిగా బుద్ధిలేదు.

నల్లత్రాచులా తారురోడ్డు షణ్ముఖం కళ్ళముందు పడుకొని వుంది.

"లేట్. లేట్! యూ ఆర్ ఆల్‌వేస్ లేట్- బుద్ధిలేదూ? ఇలా అయితే సస్పెండు చేస్తాను ..." ఆఫీసరు ఎలుగ్గొడ్డులా అరుస్తున్నట్టు కళ్ళముందు కన్పించాడు.

షణ్ముఖం పరుగులాంటి నడకతో చెమటలు కక్కుతూ ఆఫీసులోకి వచ్చిపడ్డాడు.

మూడుసార్లు లేటయితే ఒక క్యాజువల్ లీవు కట్ అవుతుంది. ఆ తర్వాత మూడురోజుల లేటుకు ఒక రోజు జీతం కట్ పైగా ఎన్ని మాటలు పడాలి? ఎంత టెన్షన్?

"ఆఫీసరు పిల్చారు." నురగలు కక్కుతూ ఆఫీసులోకి వచ్చి పడ్డ షణ్ముఖంతో అన్నాడు మునుస్వామి.

తను అనుకున్నంతా అయింది. ఆలస్యం అయిన రోజే పిలుస్తాడు. తొమ్మిదింటికే వచ్చి కూర్చున్న రోజు ఒక్కసారీ పిలవడు. తను నడుస్తూ రావడం కార్లో వెళ్తూ చూసే వుంటాడు. అందుకే పిల్చి వుంటాడు.

"సార్! అయ్యగారు పిలుస్తున్నారు" ప్యూన్ వచ్చి చెప్పాడు. షణ్ముఖం కాళ్ళలో వణుకూ, మెదడులో హోరూ ప్రారంభం అయింది.

పులి బోనులోకి వెళ్తున్నట్టు గుండె దడ దడ లాడుతూ వుంటే ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు.

"ఏం లేటుగా వచ్చావ్?"

"ఆలస్యం అయింది సార్!"

"ఏమిటా సమాధానం? స్టుపిడ్!"

"ఫూల్" అంటే ఫూల్ లాగా స్టుపిడ్. అంటే స్టుపిడ్‌లా ఆఫీసరు ముందు ముఖం పెట్టడం నేర్చుకుని చాలా కాలం అయింది షణ్ముఖం.

"పలకవేం! బుద్ధిలేదూ?"

అయినా మౌనంగానే నిల్చున్నాడు షణ్ముఖం. ఆఫీసర్ల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకూడదని ఎప్పుడో తెలుసుకున్నాడు.

"క్యాష్ అంతా వెరిఫై చేసి క్యాష్ బుక్ క్లోజ్ చేసిసంతకం తీసుకో. ఇవ్వాళ ముప్పై ఒకటో తారీఖని తెలుసుగా?"

"యస్ సార్!"

"వెళ్ళు!"

ఒక్కసారి బయటికి వచ్చి పడి గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు.

షణ్ముఖం వచ్చి తన సీటులో కూలబడ్డాడు. బుర్రంతా గందరగోళంగా వుంది.

ఛీ! వెధవ బతుకు! ఆత్మ గౌరవం లేని బతుకెందుకు? సర్వీస్‌లో చేరిన వాడికి ఆత్మగౌరవం వుండకూడదట! రాజీనామా పత్రం రాసి ఆఫీసరుగాడి ముఖంమీద కొట్టి ఇంటికి పోతే ...?

"ఏమండీ మందులు తెచ్చారా?"

"కందిపప్పూ, చింతపండూ తెచ్చావురా నాయనా?"

"జామెంట్రీ బాక్సు తెచ్చావా నాన్నా?"

"చిన్నదానికి ధారకం పోవడంలేదు గ్లూకోజ్ తెమ్మని చెప్పాను గదండీ."

"అబ్బబ్బ! నోరు ముయ్యండే!" కళ్ళు మూసుకొని నొసలు నొక్కుకుంటూ అరిచాడు షణ్ముఖం.

సెక్షన్లో వాళ్ళంతా ఉలిక్కిపడి చూశారు.

"ఏవన్నారండీ?" సహ ఉద్యోగి.

అప్పటికిగాని ఈ లోకంలోకి రాలేదు ఫిలాసఫీ ఆనర్సు పాసయిన షణ్ముఖం.

"సారీ!" గాడ్రేజ్ తెరిచి ఫైల్సూ క్యాష్‌బుక్కూ- వోచర్సూ, బల్లమీద పెట్టుకో


పోగాడు. ఎవరి కేసీ చూడకపోయినా అందరూ తనను చూసి ముసిముసిగా నవ్వుకుంటున్నట్టు అనిపించింది షణ్ముఖానికి.

ఫిలాసఫీ ఆనర్సులో క్లాసు! వెధవ క్లాసు ఎందుకు? తను ఎందుకు బతుకుతున్నాడో ఈ జీవితానికి అర్థం ఏమిటో — ఎంత ఆలోచించినా క్రాస్‌వర్డ్ పజిల్‌లా తెగడం లేదు.

కొన్నాళ్ళకి కాని కాలం వచ్చి చిక్కినట్టు ఫిలాసఫీ గ్రాడ్యుయేట్ ఎకౌంట్సు సెక్షన్‌లో యు.డి. గుమాస్తా అయ్యాడు. అదీ నాలుగేళ్ళు యల్.డి.సీ.గా పని చేస్తేగాని కాలేదు. స్కూలు ఫైనల్ వాడు చెయ్యాల్సిన ఉద్యోగంలో పోస్టు గ్రాడ్యుయేట్ అయి చేరాడు. ఏదో కొంత కాలం పని చేసి మంచి ఉద్యోగం రాగానే వెళ్ళిపోవాలనే ఉద్దేశ్యంతోనే చేరాడు కాని మంచి ఉద్యోగం దొరకడం మాట అటుంచి, ఉన్న ఉద్యోగం నిలుపుకోవడానికి తన సూక్ష్మ శక్తులూ ధారపోసి, ఆత్మాభిమానం చంపుకొని పని చేశాడు. తర్వాత తీసుకోలేక పోతానా అని ఊబిలో కాలు వేశాడు. మొలలోతు దిగబడిపోయాడు.

పొద్దుటినుంచి రాత్రిదాకా చేసినా ఈ పని






తెమిలేదికాదు. ఎకౌంట్సు అంటే తనకు మహా చిరాకు. ఫిలాసఫీ చదివినా తనకు అంకెలంటే మరి చిరాకుకదూ?

"ఇవ్వాళైనా పెందలాడే వస్తారా?" రోజూ తన పెళ్ళాం ఇదే ప్రశ్న వేస్తుంది.

సీటులో కూరున్నాడేగాని షణ్ముఖం మనస్సులో ఏదో వేదాంతం జీవితపు విలువల తాలూకు ఆలోచనలు ముసురుకుంటున్నాయి. క్యాష్ రిజిష్టరూ, కంటింజెంటు రిజిష్టరూ, బిల్లులూ, ఓచర్సూ అతని ముఖంలోకి చూస్తున్నాయి.

ఆలోచన – పని – ఒకటి ఉంటే మరొకటి సాగదు ఆలోచనల్ని బలవంతంగా వెనక్కినెట్టి పనిలో తల దూర్చాడు. ఎంతసేపు చేశాడో అతనికే తెలియదు.

"అయ్యంగారు పిలుస్తున్నారు సార్!"

షణ్ముఖం తలెత్తి చూశాడు. వాల్ క్లాక్ నాలుగుంబావు చూపిస్తోంది. ఇంకా పని పూర్తి కాలేదు. మెల్లిగా లేచి ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు.

"పూర్తయిందా?"

"ఆ౯ అయిపోతూంది సార్!"

"ఛ! ఏమ్మనిషివయ్యా? మనిషిజన్మ ఎత్తావ్ ఎందుకూ! ఎన్నిసార్లు చెప్పించుకుంటావ్!"

షణ్ముఖం గుండెలోకి బాకులు గుచ్చినట్టు అన్పించింది.

తను మనిషిజన్మ ఎందుకు ఎత్తాడా?

"రాత్రి ఎంత పొద్దుపోయినా పని పూర్తి చేసి, రిజిష్టర్సు ఇంటికి తెచ్చి సంతకాలు తీసుకో!"

షణ్ముఖం ఏదో చెప్పాలనుకున్నాడు.

"పో! ఇంకా నిలబడ్డావేం?" చీదరించుకొన్నాడు ఆఫీసరు

"ఇవ్వాళ ఇంటి దగ్గర అవసరమైన పని వుంది సార్! పిల్లలకు వంట్లో బాగాలేదు సార్" నసుగుతూ అన్నాడు.

"షటప్ ముందు వెళ్ళి పని పూర్తి చెయ్. ఈ సాకులన్నీ నా దగ్గిర సాగవ్. వెళ్ళు."

షణ్ముఖం కాళ్ళీడ్చుకుంటూ బయటకి వచ్చాడు. కారు స్టార్ట్ అయిన శబ్దం వినిపించింది. ఆఫీసరు వెళ్ళిపోయాడు.

షణ్ముఖం చకచకా రాస్తున్నాడు.

ప్యూన్ వచ్చి లైట్ వేశాడు.

"అందరూ వెళ్ళిపోయారా?" షణ్ముఖం అడిగాడు.

"ఆఁ ఎస్టాబ్లిష్‌మెంట్ సూపర్నెంటుగారు మాత్రం వున్నారు" అని చెప్పి ప్యూన్ వెళ్ళిపోయాడు.

షణ్ముఖం మళ్ళీ ఆలోచనల్లో మునిగిపోయాడు.

వాడు....వట్టి బి.య్యే. గాడు తనను ఏమన్నాడూ? తను మనిషి జన్మ ఎందుకు ఎత్తాడన్నాడా? అవును తను మనిషి జన్మ ఎందుకు ఎత్తినట్టు? గాడిదలా చాకిరీ చెయ్యడానికేగా?

మళ్ళీ, ఈ రోజూ తొమ్మిదవుతుంది. పెళ్ళాం నిష్ఠూరం; తల్లి సణుగుడు; పిల్లవాడి గోల; పాపకు ఎలా వుందో? పాపం! అది మాత్రం ఏం చేస్తుంది!

ఇంటికి వెళ్ళుతే, ఎలా? వచ్చావు డు ఏమేమో తిసుకురమ్మని చెప్పారుగా? వట్టి చేతులం వెళితే ఇంటి దగ్గిర ఎదురయే దృశ్యం కళ్ళకు కన్పించింది.

ఏమైనా ఈ నరకం నుంచి బయటపడాలి గబగబా రిజిష్టర్ మూసేశాడు.

కాని... మళ్ళీ తను వెళ్ళేది మరో నరకంలోకేగా! నరకం నుంచి నరకానికి తన ప్రయాణం. ఈ ప్రయాణానికి అంతెప్పుడో?

ఆఫీసు ఒక యంత్రం. అందులో తను ఒక చక్రం. చక్రం గిరగిరా తిరుగుతూ వుంది. దానికి విరామం లేదు. విశ్రాంతిలేదు. మనసు లేదు. మమకారం లేదు. అభిమానం లేదు.

తెల్లవారితే ఒకటో తారీఖు! అది ఎన్. జీ. ఓ. లకు పర్వదినం. కాని ఈరోజూ ఈ ముప్పై ఒకటో రోజు. ఒకటో తారీఖు తన చేతి మీదుగా పదిహేను వేలు జీతాలు పంచుతాడు. అన్నీ కట్స్ పోగా రెండొందల ఇరవై రూపాయలతో తను ఇంటికి చేరాడు!

"అయ్యగారూ ఎనిమిదయి పోయిందండీ! అందరూ వెళ్ళిపోయారు. ప్యూన్ అన్నాడు.

"ఆఁ ఎనిమిదయిందా?"

"ఇంటి దగ్గిర కొంచెం...." నసిగాడు ప్యూన్.

పని వుంది! వెళు. నైట్ వాచ్‌మాన్‌కి తాళాలు నేను ఇచ్చి వెళ్తాలే." అన్నాడు షణ్ముఖం.


జవాను నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

షణ్ముఖం మెడ మీద చెయ్యిపెట్టుకొని వెనక్కి విరుచుకున్నాడు. మెడ నొప్పిగా వుంది.

ఎదురుగా బోసి నవ్వులతో పలకరిస్తున్న గాంధీ మహాత్ముని పటం కన్పించింది.

ఆముఖంలో ఎంత ప్రశాంతత! నవ్వులో ఎంత చల్లదనం? ఆ కళ్ళలో ఎంత వెలుగు! ఎంత నిరాడంబర జీవి? తనకెం తక్కువవని. పంటినిండా బట్టకూడా కట్టుకోకుండా సన్యాసిగా బతికాడు? ఎవరికోసం! తనకోసం కాదు. తన దేశంకోసం! తన దేశంలోని ప్రజల కష్టాల నివారణకోసం! ఎన్ని బాధలు పడ్డాడు? ఎన్నిసార్లు జైలుకు వెళ్ళాడు? ధన్యజీవి! మానవజన్మ అంటే అది

మరి తనో! తన ఇంట్లో వారి కష్టాలను కూడా తీర్చలేకుండా వున్నాడు. పైగా విసు




కుంటున్నాడు! తన బిడ్డల్ని తను సుఖ పెట్టలేకపోతున్నాడు.

గాంధీజీ లోక కల్యాణంకోసం జైలుకు వెళ్ళాడు స్వరాజ్యం తెచ్చాడు. మరి తను. తనలాంటివారూ ఇంకా ఇలాగే వున్నారేం

క్షణం తీరిక లేదు. ఎప్పుడూ ఎద్దు గానుగెద్దులా అరిగే ఆఫీసు. శరీరాన్ని. ఆత్మనూ అమ్ముకొని సంపాదించే నెల జీతం రెండువందల ఇరవై రూపాయలా! క్షణకాలం శాంతి లేని కొంపా ఎప్పుడూ ఏడుస్తూ ఎదురయే ఇల్లాలు! సాధించే తల్లి! అది కావాలి ఇది కావాలి అంటూ ఏడ్చే పిల్లలూ! ఎప్పుడూ రోగాలూ మందులూ

"ఖంగ్ ఖంగ్" చిన్నకొడుకు దగ్గు

"నాన్నా! నాన్నా!" జబ్బులో వున్న చిన్నకూతురి కలవరింత.

'జామెంట్రీ బాక్సు' పెదకొడుకు నిద్రలో.

"ఇవ్వాళైనా పెందలాడే వస్తారా?" కలలో భార్య.

"ఒరే నాయనా! ఇంట్లో సరుకులు నిండుకున్నాయిరా! మూగన్నుగా తల్లిగొణుగుడు.

షణ్ముఖం చెవులు మూసుకున్నాడు. అయినా మాటలు వినిపిస్తూనే వున్నాయి.

"హే మహాత్మా! నా కళ్ళు తెరువు నాకు వెలుగును ప్రసాదించూ! నాకు జ్ఞానబోధ చెయ్ సన్నెం చెయ్యమంటావ్ గాంధీ మహాత్ముని ఫొటో కేసి చూస్తూ పైకి అన్నాడు షణ్ముఖం

గోడ గడియారం తొమ్మిది కొట్టింది క్యాష్ బుక్ క్లోజ్ చేసి క్యాష్ బాక్సు తీశాడు. క్యాష్ లెక్క పెట్టుకున్నాడు. సరిపోయింది. ఆఫీసుకు ఇంటికి వెళ్ళాలా వద్దా అనే ఆలోచనలో పడ్డాడు

మహాత్ముని కేసి చూశాడు. రెండు చేతులూ జోడించి నమస్కరించి స్వామీ! జ్ఞానోదయం అయింది అన్నాడు.

షణ్ముఖం ఇంటికి చేరేప్పటికి పది దాటింది.

అందరూ నిద్రపోయారు.

ఆదిలక్ష్మి మాత్రం దర్వాజాకు చేరబడి జోగుతూవుంది.

షణ్ముఖం భార్యను లేపకుండా లోపలకు వచ్చాడు.

అలికిడికి ఆదిలక్ష్మి కళ్ళు తెరిచింది భర్తను చూసి లేచి నిలబడింది.

"ఏమండీ!" ఆదిలక్ష్మి ఏడుపు గొంతు

షణ్ముఖం ఊరికే తన గదిలోకి వెళ్ళి తలుపులు బిగించుకున్నాడు.

మూసుకున్న తలుపులకేసి చూస్తూ ఆదిలక్ష్మి నిట్టూర్పు విడిచింది.

* * *

"ఒరేయ్ పెదబాబూ! మీ నాన్ననులేపరా ఎనిమిది దాటింది ఇంకా నిద్రేమిటి!" కొడుకుని పిల్చి అన్నది ఆదిలక్ష్మి.

ప్రసాదు తలుపు కొట్టాడు. తలుపులు తెరిచే వున్నాయి. తండ్రి పడుకునే మంచం ప్రసాదు ముఖంలోకి బోసిగా చూసింది.

"అమ్మా నాన్న కన్పడ్డం లేదు!" బిక్క మొహంతో అన్నాడు ప్రసాదు.

ఆదిలక్ష్మి మాటాపలుకూ లేకుండా కుప్పకూలిపోయింది.

ఒరే నాయనా! ఏమైపోయావురా! తల్లి రాగాలు పెట్ట సాగింది

మధ్యాహ్నం పోలీసులు షణ్ముఖం శవాన్ని మట్టడించారు ఇలా ఓ డ్డీ అంటా నోటా ఒకరు ఇంట్లో వాళ్ళను అడగాల్సిన ప్రశ్నలన్నీ అడిగి పోలీసులు వెళ్ళిపోయారు.

వీధి వాకిలిముందు జనం చేరా

"మనిషి చూస్తే బుద్ధిమంతుడిలా కన్పించేవాడు."

"బాగా చదువుకున్నవాడు! ఇదేం పని!"

"ఒకటా రెండా ... ఇరవై వేలు ..." తలా ఒక మాటా అంటున్నారు.

అందరూ వచ్చి తలోక రకంగా పరామర్శిస్తున్నారు.

ఆదిలక్ష్మి బిడ్డల్ని ఒళ్ళో పడుకో బెట్టుకొని కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ వుంది.

తల్లి గుమ్మ గుండెలు బాదుకుంటూ భోరు భోమన ఏడుస్తూ వుంది.

మూడోరోజు రాత్రి ఆదిలక్ష్మి అన్నయ్య రంగనాథం విజయవాడనుంచి వచ్చాడు!

"అన్నయ్యా" అన్నను చుట్టుకొని ఆదిలక్ష్మి గుండెలు పగిలేలా ఏడిచింది.

"ఊరుకో అమ్మాయ్! ఏం చేస్తాం? రేపు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు వెళ్దాం! సామాను సర్దు" అన్నాడు రంగనాథం.

"నీ సంసారమే అంతంత మాత్రంగా వుందే. ఇంతమందినీ తీసుకెళ్ళి ఏం చేస్తావ్ అన్నయ్యా!" ఏడుస్తూనే అన్నది.

"పోయిన వాడు పోయిన — గుడిలో మెల్లగా ఒకదారి చూపించేపోయాడులే. నీ బిడ్డలు చదువుకొని ప్రయోజకులు అయిందాకా సుఖంగా బతకొచ్చులే!" చెల్లెలి చెవి దగ్గిర చిన్నగా అన్నాడు రంగనాథం.

ఆదిలక్ష్మి వెర్రిదానిలా అన్న ముఖంలోకి చూసింది.

"ఊం! త్వరగా సామాను సర్దుకో! మళ్ళీ చీకటితోనే లేవాలి" అన్నాడు రంగనాథం.

★